## నిత్యాన్నదాన పథకానికి రూ.2,50 లక్షలు విరాళం

కాణిపాకం, డిసెంబర్ 17 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు శనివారం 2.50 లక్షలు రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన పి.రాధిక అనే భక్తురాలు నిత్యాన్నదానంకు 2.50 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.




## రాహుకేతు పూజలు జరిపించుకున్న ఎల్‌వి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆలయంలో రద్దీ అధికంగా కనబడింది. ఓ వైపు విఐపిలు, మరో వైపు సామాన్యభక్తుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో రాహుకేతు పూజల్లో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం కుటుంబసభ్యులతో కలసి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎసి మల్లికార్జున్ ప్రసాద్ స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

# ఆ పదిరోజులు మహాలఘునే !

## జనవరి 2న వైకుంఠ ఏకాదశి, 3న ద్వాదశి
## వైకుంఠద్వార దర్శనం ఏర్పాట్లపై టిటిడి ప్రణాళికలు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజులు పాటు వైకుంఠద్వారాలు తెరచి భక్తులకు దర్శనాలు కల్పించేందుకు టిటిడి సిద్ధమవుతోంది. గోవిందుడు కొలువైవున్న ఆనందనిలయానికి ఆనుకునే ఉన్న వైకుంఠద్వారం మోక్షమార్గం 2023 జనవరి 1వతేదీ అర్థరాత్రి దాటిన తరువాత ఆగమోక్తంగా తెరవనున్నారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో ఏకాదశి,ద్వాదశి ఘడియల్లో మాత్రమే వైకుంఠద్వారం తెరిచి భక్తులకు ముక్తిని కల్పించడం పరిపాటి. అయితే గత ఏడాదినుంచి పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు చేయిస్తున్నారు. 2023 జనవరి 2వ తేదీ నుంచి 11వరకు పదిరోజులు వైకుంఠ ద్వారాలు తెరచి రోజుకు 80వేలమంది భక్తులకు దర్శనం చేయించాలని నిర్ణయించారు. ఇందులో సమయనిర్ధేశిత సర్వదర్శనం 50వేలు టిక్కెట్లు,300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు 25వేలు, వెనుకబడిన ప్రాంతాల భక్తులు, విఐపిలకు కలిపి మరో 5వేల టిక్కెట్లు జారీచేయనున్నారు. అన్ని రకాల ఆర్జితసేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. తిరుమలలో భక్తులకు కల్పించే అన్ని రకాల దర్శనాలను రద్దుచేస్తారు. ఆ పదిరోజులు ఆన్‌లైన్‌లో రోజుకు 2వేలు శ్రీవాణి టిక్కెట్లు విడుదల చేస్తారు. శ్రీవాణి దాతలతో సహా అందరికీ ఆ పదిరోజులు మహాలఘుదర్శనంలోనే స్వామివారిని వీక్షించేలా చూడనున్నారు. తిరుమల స్థానికుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన కౌంటర్‌తోబాటు తిరుపతిలోని తొమ్మిదికేంద్రాల్లో రోజుకు 50వేల ఎస్‌ఎస్‌డి టోకెన్లు జారీచేస్తారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా చూపి ఈ టోకెన్లు పొందాల్సి ఉంది. వైకుంఠ ఏకాదశిరోజు ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేను దర్శన టిక్కెట్లు టిటిడి కేటాయించనుంది. జనవరి 2వతేదీ వైకుంఠ ఏకాదశిన తిరుమలలో ఉదయం స్వర్ణరథం ఊరేగింపు ఉంటుంది. 3వతేదీ స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానమహోత్సవం నిర్వహిస్తారు. స్వర్ణరథం లాగడానికి టిటిడి మహిళ ఉద్యోగినులు తమ పేర్లను 26వ తేదీలోపు నమోదు చేసుకోవాల్సి ఉంది.

### గడప గడపకు అర్జీలు

## ఎప్పటికప్పుడు అప్‌లోడ్

### - కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి ప్రజాప్రతినిధులకు పనులపై అందుతున్న అర్జీలను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి శనివారం కలెక్టర్ హరినారాయణన్ ఎంపిడిఓలు, ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 3,137 పనులను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించడం జరిగిందని, ఇందులో 1,514 పనులు కలెక్టర్ ఆమోదం ఇచ్చారని ఇందులో 286 పనులు వందశాతం పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో 730 పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 616 పనులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి 85, ఇతర ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి 66 పనులు జరుగుతున్నాయన్నారు. పనులు చేపట్టడానికి అధికారులు సిమెంట్ కోసం ఇండెంట్ పెట్టాలని ఇప్పటికే ఇండెంట్ పెట్టి వుంటే వచ్చిన సిమెంట్‌ను సరిచూసుకొని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వాటికి సత్వరం బిల్లులు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంజూరు చేసిన పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎస్‌ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ నాగజ్యోతి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, సిపిఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మోహన్‌కృష్ణను భౌతికంగా హింసించారు

### భరించలేకే ఆత్మహత్యకు పాల్పడింది
### అర్బన్ ఎస్పీ ఆదేశాలతో దర్యాప్తు వేగవంతం :డిఎస్పీ నరసప్ప



చంద్రగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

ఇంటర్మీడియెట్ విద్యార్థిని మోహన్‌కృష్ణను బతికుండగా బాగా హింసించారని డిఎస్పీ నరసప్ప అన్నారు. రెడ్డివారిపల్లిలో ఇంటర్ విద్యార్థిని మోహన్‌కృష్ణ ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పోస్టుమార్టం నివేధిక ఆధారంగా దర్యాప్తు చేపట్టిన కేసులో పోలీసులు 6 మందిని శనివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 జూలై 7న మృతురాలి తండ్రి మునిరాజ తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆంజనేయపురంకు చెందిన వికాస్ అనే యువకుడిని ప్రేమించిందనీ, అందుకు పెద్దలు అంగీకరించకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన్లు వెళ్ళడించారన్నారు. దీనిపై ఎస్‌ఐ వంశీధర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారన్నారు. మృతురాలి శరీరంపై జీవించి వుండగా గాయాలు ఏర్పడినట్లు డాక్టర్లు పోస్టుమార్టం నివేధిక ఇవ్వడం జరిగిందన్నారు. డిశంబర్ 1న హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. కేసు తీవ్రత దృష్ట్యా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. ఇంట్లో నుండి పారిపోయిన బాలిక వికాస్‌తో కలసి వున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇంటికి రమ్మని పిలిచినా రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎస్‌ఐ హిమభింధు ఇద్దరి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు తెలిపారు. ఈ క్రమంలో రెడ్డివారిపల్లిలో వున్నట్లయితే బాలిక తిరిగి పారిపోయే అవకాశం వుంని భావించి, గాండ్లవీధిలోని బంధువుల ఇంటికి తీసుకెళ్ళారు. బాలికను ఎంతగా ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికీ వికాస్‌నే పెళ్ళి చేసుకుంటానని మొండికేయడంతో నిందితులు పలుమార్లు కొట్టడం జరిగిందన్నారు. దీంతో బాలిక నిందితుల హింస భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఇక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు బయటకు పొక్కితే ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తుందని మృతదేహాన్ని రెడ్డివారిపల్లికి తీసుకెళ్ళి అక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు నాటకమాడినట్లు తెలిపారు. దీంతో సాక్ష్యాలను తారుమారు చేయడం, బాలికను హింసించడం, రెడ్డివారిపల్లిలో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పడం వంటి నేరాలపై కేసులు నమోదు చేసి 6 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ సిఐ శివప్రసాద్ (తిరుపతి వెస్ట్), సిఐ తులసీరామ్ (భాకరాపేట), ఎస్‌ఐ వంశీధర్, తిరుపతి వెస్ట్ ఎస్‌ఐ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న జన్మదిన వారోత్సవాలకు విశేష స్పందన

### 20ఏళ్ళకు ముందు నుంచే సంబరాలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 సంవత్సరాలకు ముందునుంచే జగనన్న జన్మదిన సంబరాలను 'జగన్ ఛారిటబుల్ ట్రస్టు' ద్వారా నిర్వహిస్తున్నామని శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి అన్నారు. శనివారం ఇక్కడి జిల్లా పరిషత్ ఆర్‌పిబియస్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న 50వ జన్మదిన సంబరాల వారోత్సవాల్లో భాగంగా మెగాజాబ్‌మేళాను నిర్వహించారు. ఇందుకు హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, శ్రీసిటి, రేణిగుంటలోని పారిశ్రామిక వేత్తలతో కలసి నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భావించామన్నారు. తమ అంచనాలకుమించి దరఖాస్తులు వచ్చాయని, అందులో ఎక్కువభాగం నిరుద్యోగులకు అవకాశం కల్పించామన్నారు. కాగా 14మంది వికలాంగులకు ఉద్యోగవకాశాలు కల్పించామన్నారు. ఒకే సారి సుమారు 2500 మందికి ఉద్యోగవకాశాలు కల్పించటం శ్రీకాళహస్తి చరిత్రలో ఇదే మొదటి సారి అని శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి, ఓడూరు గిరిధర్‌రెడ్డి, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్, వయ్యాల కృష్ణారెడ్డి, మోహన్‌నాయుడు, చిటివేలు జయగోపాల్, సుబ్బారెడ్డి, భక్త, చింతామణి పాండు, శరవణ, నందా, హరి, కంచి గురవయ్య, నాని, మున్నా, తిరుకాల మల్లికార్జున్ గౌడ్, శంకర్, కిరణ్, పసల కృష్ణయ్య, సుమతి, సునీత సింగ్, రుషేంద్రమణి, లక్ష్మీపతి, మొద్దుమూడి రవి, చింతా రాజేంద్ర, వాసుదేవరెడ్డి హరి తదితరులు

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

### - కలెక్టర్ వెంకటరమణారెడ్డి



కాయం లే అవుట్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

వడమాలపేట, డిసెంబరు 17 ప్రభాతవార్త:

జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కాయం లే అవుట్‌లో డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్‌తో పాటు సందర్శించారు. లే అవుట్‌లో నిర్మించిన ఇళ్ళను, నిర్మాణంలో ఉన్న ఇళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొంత మంది గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంకా ప్రారంభం కానీ గృహ నిర్మాణాల లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి, అవగాహన కల్పించి, ప్రోత్సహించి తక్షణం ప్రారంభించేలా మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన డిసెంబరు 21 నాటికి గృహ ప్రవేశాల ప్రారంభంకు గృహాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లే అవుట్‌లో తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణంకు అవసరమైన వస్తువులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. మండల శాఖ అధికారులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్‌బాబు, ఏఈ వెంకటరత్నం, ఏవో శేఖర్, విద్యుత్ శాఖ ఏఈ భాస్కర్‌రాజు, పంచాయతీ రాజ్ ఏఈ నరసింహామూర్తి, వెలుగు ఏపీఎం మురళీకృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఒంటరి ఏనుగు బీభత్సం

పలమనేరు, డిసెంబరు 17, ప్రభాతవార్త:

మండలంలో ఓ ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టిస్తుంది. గత కొద్ది రోజులుగా మండంలోని పలు ప్రాంతాలలో రైతుల పంటలపై ఆ ఏనుగు దాడులు చేస్తు పంటలను ధ్వంసం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని మొసలమడుగు, ఏటిగడ్డ గ్రామంలోకి ప్రవేశించిన ఒంటరి ఏనుగు సమీపంలోని పొలాలను ద్వంసం చేసింది. రైతులు మురగేషులుకు చెందిన పొలానికి వేసిన ఇనుప కంచెను విరిచి సుమారు 30 సంవత్సరాల మామిడి చెట్లను, సుమతమ్మకు చెందిన అరటి తోటను, వేలుమురగన్, రాజేంద్రకు చెందిన కొబ్బరి చెట్లు, పశుగ్రాసం, ఉమాపతినాయుడుకు చెందిన మామిడి తోటను ధ్వంసం చేసింది.



## శ్రీకృష్ణస్వామికి ఏకాంత పూజలు

### -తిరుప్పావై ప్రవచనాలు ఆరంభం



తిరుమల, డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:

పవిత్రమైన ధనుర్మాసం ఆరంభంతో ఏడుకొండల వెంకన్న ఆలయంలో ఏకాంతంగా తిరుప్పావై ప్రవచనాలు ఆరంభమయ్యాయి. 30రోజులకు రోజుకో పాశురం ప్రవచనంతో వెంకన్నను మేల్కొలుపుతారు. ఆలయంలో ఏడాదిలో నెలరోజులు తప్ప మిగితా రోజుల్లో భోగశ్రీనివాసమూర్తి పూజలందుకోగా ధనుర్మాసంలో శ్రీకృష్ణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేస్తారు. ప్రతిరోజూ కొండపై పెద్దజీయర్‌మఠంలో ఉదయం తిరూప్పావై ప్రవచనాలు జీయర్‌స్వాములు పఠించి గోదాదేవి, శ్రీకృష్ణస్వామికి ప్రసాద వితరణ చేస్తారు. తిరుపతిలో కూడా మహతి కళాక్షేత్రంలో గోదాదేవి తిరుప్పావై ప్రవచనాలు మొదలయ్యాయి.

## పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు "బాలోత్సవం" అవసరం!






తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిలోని నైపుణ్యానికి పదును పెట్టేందుకు ఇలాంటి బాలోత్సవ కార్యక్రమాలు ఎంతో అవసరమని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయత వెలికి తీయడమే లక్ష్యంగా శనివారం స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు "బాలోత్సవం" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వచ్చి ఉత్సాహంగా తమ టాలెంట్‌ను నిరూపించుకుంటూ పోటాపోటీగా పాల్గొంటున్నారు. చిన్నారుల అభినయం ఆహుతులను కట్టిపడేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూమన, నగర మేయర్ డా॥శిరీషలు హాజరయ్యి బాలోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా తమను తాము అభివృద్ధి చేసుకుంటూ దేవాభివృద్ధికి సహాయపడాలన్నారు. విలువలతో కూడిన జీవితాలను గడుపుతూ సంఘానికి ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో బాలోత్సవం కమిటీ నిరంతరం కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాలలో రాణించాలని, శాస్త్రీయ దృక్పథంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య వేదిక ద్వారా జానపద నృత్య ప్రదర్శన, యామిని కృష్ణమూర్తి వేదిక ద్వారా శాస్త్రీయ నృత్య పోటీలు, శంకరంబాడి వేదిక ద్వారా దేశభక్తి గీతాలాపన, పూని నాగేశం వేదిక ద్వారా ఏకపాత్రాభినయం, ప్రధాన వేదికైన చాచా నెహ్రూ వేదికపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం జిల్లా కార్యదర్శి ఎం.నాగార్జున, గౌరవాధ్యక్షుడు నడ్డా నారాయణ, కార్యదర్శి రెడ్డెప్ప, కోశాధికారి గురునాథం, మునిరామయ్య, సాకం నాగరాజు, మల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారు

### -మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు 17, ప్రభాతవార్త:

అధికారం తమ చేతిలో ఉందని వైకాపా నేతలు రాష్ట్రంలో అడ్డు అదుపు లేని అరాచకాలు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 16న మాచర్లలో వైకాపాకు చెందిన అల్లరిమూకలు చేసిన విధ్వంసకాండపై శనివారం ఆయన స్పందించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల సమక్షంలోనే టిడిపి నేత బ్రహ్మారెడ్డి ఇంటితో పాటు టిడిపి కార్యాలయాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టి రౌడీ మూకలు 3 గంటలపాటు విధ్వంసకాండ సృష్టించారంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌ను అరాచకాలకు అడ్డాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చేస్తున్నారని, వైకాపా పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# నిరుద్యోగ యువతను మత్తుకు బానిస చేస్తున్న ప్రభుత్వం

- పాలసముద్రంలో ఇదేం ఖర్మ కార్యక్రమంలో జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ బి.చిట్టిబాబు

పాలసముద్రం, డిసెంబర్ 17 ప్రభాతవార్త:
గత మూడున్నర సంవత్సరాలుగా 1.5 కోట్ల నిరుద్యోగ యువతను ప్రభుత్వం మత్తుకు బానిస చేసిందని జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ భీమినేని చిట్టిబాబు ధ్వజమెత్తారు. మండల కేంద్రం పాలసముద్రంలో శనివారం జరిగిన ఇదేం శర్మ కార్యక్రమంలో జిడ నెల్లూరు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ భీమినేని చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడ పిల్లలకు భద్రత లేకుండా పోయిందని రాత్రి 8 గంటలు దాటితే రాష్ట్రంలో



మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ధ్వజమె త్తారు. దిశ చట్టం వచ్చిన ఏ మాత్రం ఫలితం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యంతో ప్రతి ఏటా రాష్ట్రంలోని ప్రతి కుటుంబంపై 25 వేల రూపాయల భారం పడుతుందన్నారు. దేశంలోనే గంజాయి ఎగు మతుల్లో రాష్ట్రం అగ్రస్థానం నిలిచిందని కేంద్ర ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయని ఆరోపించారు. చలి కాలంలో సైతం విద్యుత్ బిల్లుల మోత మోగుతున్నాయని ధ్వజమె త్తారు. ఈ కార్యక్రమంలో మండల దేశం అధ్యక్షుడు రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, పంచాయతీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివం, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆరుళ్‌నాథం తదితరులు పాల్గొన్నారు.

## 19న ఉచిత శిక్షణ ఉపాధి అవగాహన సదస్సు

చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త
ఈనెల 19న నిరుద్యోగ యువతీ, యువత కోసం ఉచిత శిక్షణ, ఉపాధి సదస్సును నిర్వహించనున్నట్లు వెలుగు ఎపిఎం సర్వోత్తమరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిఆర్‌డిఏ సంచాలకులు తులసీ ఆదేశాల మేరకు స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనం నందు సదస్సు జరుగుతుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ చదివి, 18-29వయస్సు మధ్యవున్న నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9676180056నంబరును సంప్రదించాలన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

కల్లూరు,డిసెంబరు17ప్రబాతవార్త
పులిచెర్ల మండలంలోని కావేటిగారిపల్లె పంచాయతీ పరిదిలోని చెన్నుపాటివారి పల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త నియామకానికి ధరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు చిత్తూరు జిల్లా ఐసిడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. పదవతరగతి పాసైన ఓసీ అభ్యర్థినులు ఆవూరి కోడలై ఉండి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 27వ తేదీలోగా ధరఖాస్తులు వేసుకోవాలని అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల్ల లోపు ఉండాలని పేర్కొన్నారు.

## రాకపోకల పునరుద్ధరణ

సదుం,డిసెంబరు17ప్రభాతవార్త
ఇటీవల కురిసిన మాండూస్ తుఫాను కారణంగా సదుంలోని గార్గేయనదిలో భారీ స్థాయిలో నీరు వచ్చింది. దీనితో సదుం సోమల మార్గంలోని తాత్కాలిక వంతెనకొట్టుకు పోయింది. ఈపరిస్థితులలో వాహనాలు అటు కలికిరిమార్గంలోని తితిదే కల్యాణమండపం మీదుగా కలకటవారిపల్లె మార్గంలో తిరిగేవి. దీనివల్ల ప్రజలకుఅవస్థలు ఉండేవి. అయితే గత రెండు రోజుల పాటు అదికారులు శ్రమింది ఈ మార్గంలో పైపులు పెట్టి మట్టి పోసి మళ్లీ రాకపోకలు పునరుద్దరించారు. దీనితోప్రజలకు, వాహన దారులకు చుట్టు తిరిగి వెళ్లే పరిస్థితి తప్పింది. కార్యక్రమంలో ఎస్ఐ మారుతి, గొంగివారిపల్లె మాజీ సర్పంచినారాయణరెడ్డి, సింగిల్‌విండోఉపాధ్యక్షుడురమేష్‌రెడ్డి, సత్యనారాయణ, భాస్కర, అమరపాల్గొన్నా రు

## వాటర్‌షెడ్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

సదుం,డిసెంబరు17ప్రభాతవార్త
మండల పరిదిలోని జోగివారిపల్లెలో శనివారం వాటర్‌షెడ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వచ్చే ఏడాది చేపట్టవలసిన పనులను గురించి చర్చించారు. అనంతరం నీటి వృదాను అరికట్టే చర్యలు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఛైర్మెన్ రమేష్‌రెడ్డి, సర్పంచి అనితాకుమారి, టీఓ గుణవతి, పంచాయతీకార్యదర్శి సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## దాడులకు ప్రతిదాడులు చేయడానికి సిద్ధం

బంగారుపాళ్యం, డిసెంబర్ 17 ప్రభాతవార్త:
వైఎస్ఆర్‌సిపి నాయకులు చేస్తున్న దాడులకు ప్రతి దాడులు చేయడానికి టిడిపి నాయకులు సిద్ధంగా వున్నారని మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. శనివారం తిమ్మోజిపల్లిలో జరిగిన ఇదేం ఖర్మరా బాబు కార్యక్రమంను దేశం నాయకులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ముద్రించిన కరపత్రాలను నాయకులు ప్రజలకు పంచి పెట్టి వివరించారు. అనంతరం స్థానిక విలేకరులతో నాయకులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా మాచర్లలో టిడిపి నాయకులపై వైకాపా నాయకులు దాడులు చేయడం అన్యాయమన్నారు. శాంతియుతంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తుంటే వైకాపా నాయకులు, కార్యకర్తలు దాడులు చేయడం తగదన్నారు. చేస్తున్న దాడులకు ప్రతి దాడులు చేయడానికి రాష్ట్రంలోని టిడిపి నాయకులు సిద్ధంగా వున్నారన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడు, జిల్లా పార్టీ కార్యదర్శి కోకా ప్రకాష్‌నాయుడు, మాజీ ఎఎంసి ఛైర్మన్ జయచంద్రనాయుడు, టిడిపి నాయకులు రాజేంద్రనాయుడు, రమేష్, కృష్ణకుమారి, లోకనాధనాయుడు, జాకీర్, నాసిర్, కుమారి, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

## రీ-సర్వే పనులు పరిశీలన

పాలసముద్రం, డిసెంబర్ 17 ప్రభాతవార్త:
మండలంలోని సింహారాజపురం, బాలకృష్ణాపురం రామకృష్ణాపురం గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమంను శనివారం తహసిల్దారు బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దారు బాబు మాట్లాడుతూ మండల పరిధిలోని రెండు పంచాయతీల్లో రైతులను అందుబాటులో వుంచుకొని భూముల రీ-సర్వే కార్యక్రమంను పక్కాగా నిర్వహించి పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ రెండు పంచాయతీల్లో భూముల రీ-సర్వే పూర్తి అయిన తరువాత మండల పరిధిలోని ఇతర పంచాయతీల్లో రీ-సర్వే చేపట్టి పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు, సర్వేయర్లు, పంచాయతీ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త
చౌడేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవాలని ఎసిడిపిఓ సరళాదేవి తెలిపారు. చౌడేపల్లి-4కు జనరల్ కేటగిరిలో సహాయకురాలు, సోమల మండలం ఫిరంగులగుట్ట మినీ అంగన్‌వాడీకి ఎస్టీ కేటగిరిలో కార్యకర్త, బోనమంద మినీఅంగన్‌వాడీకి జనరల్ కేటగిరిలో కార్యకర్త పోస్టుకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టులో సంప్రదించాలని ఆమె కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## మంత్రి పెద్దిరెడ్డిని కలసిన రెస్కోఛైర్మన్

కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త
రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం కుప్పం రెస్కోఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్ కలిశారు. అనంతపురం జిల్లా పెనుగొండలో మంత్రి పెద్దిరెడ్డిని కలసిన రెస్కోఛైర్మన్ తన జన్మదినం సందర్భంగా మంత్రి ఆశీర్వాదం పొందారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్‌కు స్వీటు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుప్పంలో పార్టీ స్థితిగతులపై మంత్రి ఆరా తీశారు.

## కళాశాలల్లో ర్యాగింగ్‌లకు పాల్పడితే శిక్షలు తప్పవు - అర్బన్ సిఐ

కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త



కళాశాలలు, పాఠశాలల్లో సహచర విద్యార్థులను ర్యాగింగ్‌కు ఎవరైనా గురిచేస్తే కఠిన శిక్షలు తప్పవని అర్బన్ సిఐ శ్రీధర్ హెచ్చరించారు. శనివారం కుప్పం ఇంజపీరింగ్ కాలేజ్‌లో ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ర్యాగింగ్ అంటే విద్యార్థిని అవమానించడం, భయపెట్టడం, నిర్బంధించడం, దౌర్జన్యం చేయడం, గాయపరచడం వంటి దుశ్చర్యలన్నారు. ర్యాగింగ్‌కు ఎవరైనా పాల్పడితే వారికి జైలుశిక్ష తప్పదన్నారు. విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, ఎస్సై శివకుమార్, హెచ్ఒడి లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

కుప్పంరూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త
కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ అరుణశ్రీ కోరారు. కుప్పం మండలంలో 3 హెల్పర్, రామకుప్పంలో మినీ అంగన్‌వాడీ వర్కర్ 2, హెల్పర్ 2 పోస్టులు, శాంతిపురంలో మెయిన్ 1, మినీ 2, హెల్పర్ 6 పోస్టులు, గుడుపల్లెలో మెయిన్1, హెల్పర్ 1పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారుఈనెల27వతేదిలోగా ఐసిడిఎస్ కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

## పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే మాచర్ల దహనకాండ

శాంతిపురం, డిసెంబర్ 17 ప్రభాతవార్త
ఇంటెలిజెన్స్ ఎడిజి సీతారామాంజనేయులు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పర్యవేక్షణలోనే మాచర్ల దహన కాండ చోటు చేసుకుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆరోపించారు. రాష్ట్రంలో స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం కొనసాగుతోందనేందుకు ఈ సంఘటన ఉదాహరణ అన్నారు. తమ పార్టీ నేతలు ప్రశాంతంగా ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తుంటే తమ కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. కార్లు, ద్విచక్రవాహనాలు, ఇళ్లు ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 40మంది తెదేపా నేతలు, కార్యకర్తలను హతమార్చారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ వైఫల్యం చెందిందన్నారు.

## బెంగళూరులో రామకుప్పం వాసి మృతి

రామకుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త
బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముద్దనపల్లికు చెందిన నాగరాజు (45) మృతి చెందాడు. ఇతనుజీవనోపాధికైకుటుంబీకులతో కలసి పదేళ్ల క్రితం బెంగళూరు వెళ్లి తరచూ స్వగ్రామంకు వచ్చేవాడు. అయితేరోడ్డుప్రమాదంలోఅతనుమృతిచెందడంపట్లమండలతెదేపానేతలు పగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## వైకాపా పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు - దేశం నేతలు

పెద్దపంజాణి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజలకు ఇదేం ఖర్మరా అనిపిస్తున్న వైకాపా పాలనకు ప్రజలే చరమగీతం పాడతారని మండల తెదేపా అధ్యక్షుడు ఆనంద, మాజీ ఎంపిపి మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం పెద్దారిగుంట, లింగాపురం పంచాయతీల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని విధాలా దివాళా తీసిందన్నారు. ప్రతిపక్షాలపై దాడులు, కేసులు పెరిగాయని మరో పక్క అక్రమ వ్యాపారాలు యధేచ్ఛగా సాగుతున్నాయని విమర్శించారు. గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు అధికమయ్యాయన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసేశారన్నారు. ప్రజలను అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేస్తున్న వైకాపా ప్రభుత్వంను సాగనంపాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నేతలు చలపతి, నాగిరెడ్డి, సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, గంగప్ప, కృష్ణారెడ్డి, వేమారెడ్డి, ఐటిడిపి మణి, చెంగారెడ్డి, విశ్వనాథరెడ్డి, గణపతి, మురహరిరెడ్డి, రామచంద్ర, మాజీ ఎంపిటిసి నంద తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను మొండి బకాయిల వసూళ్ళకు ప్రత్యేక కార్యాచరణ

- దీర్ఘకాలికంగా బకాయిలు వున్న వారికి రెడ్ నోటీసులు జారీ - సత్‌ఫలితాలు ఇస్తున్న కమిషనర్ డాక్టర్ జె.అరుణ చర్యలు



చిత్తూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో పేరుకుపోయిన ఆస్తి పన్ను మొండి బకాయిలు వసూలు చేయడానికి కమీషనర్ డాక్టర్ జె.అరుణ సిద్ధం చేసి ప్రత్యేక కార్యాచరణ సత్‌ఫలితాలు ఇస్తోంది. దీర్ఘకాలికంగా ఆస్తి పన్ను చెల్లించని వారి జాబితా సిద్ధం చేసిన మున్సిపల్ రెవెన్యూ యంత్రాంగం వారిపై ఒత్తిడి తీసుకువస్తుండటంతో ఒకొక్కరు ముందుకు వచ్చి బకాయిపడ్డ ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. గత రెండు నెలలుగా ఆస్తి పన్ను బకాయి వున్న వారిని గుర్తించి వారితో పన్ను చెల్లించడానికి ఒత్తిడి తీసుకువస్తుండటంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇప్పటికే ఒక కోటి రూపాయలకు పైబడి జమ అయ్యింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలికంగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారిపై మున్సిపల్ రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు నగర పరిధిలో వున్న 50 వార్డు సచివాలయాల్లో ఆస్తి పన్ను బకాయిలు ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో వున్న టాప్-100 జాబితాను సిద్ధం చేశారు. అలాగే అత్యధిక మొత్తంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు గత కొన్నేళ్ళుగా ఆస్తి పన్ను బకాయి పడ్డ వారి జాబితాను అధికారులు రూపొందించారు. ఈ మేరకు వారికి మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని ముందుగా నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన వారిలో స్పందించిన వారిని మళ్ళీ మున్సిపల్ రెవెన్యూ అధికారులు గుర్తించి వారికి రెడ్ నోటీసులు జారీ చేశారు. అలాగే ఉన్నత అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి మొండి బకాయిలు వున్న వారితో బకాయిలు సత్వరం చెల్లించాలని ఒత్తిడి పెంచడం ప్రారంభించారు. చిత్తూరు నగరంలో ప్రధానంగా హోటళ్ళు, విద్యా సంస్థలు, గ్రానైట్ పరిశ్రమలు, షోరూమ్‌లు, పెద్ద వ్యాపారాలు నిర్వహిస్తున్న భవన యాజమానులు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలను గుర్తించి ఉన్నత అధికారులు స్వయంగా రంగంలోకి దిగి పన్నులు చెల్లించకుంటే భవనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో ఆస్తి పన్ను బకాయి పడిన వారు బకాయిలను చెల్లించడానికి ముందుకు వస్తున్నారు. చిత్తూరు నగరంలో మౌళిక వసతుల కల్పనకు నగర పాలకసంస్థకు వచ్చే పన్నులే ప్రధాన వనరు అని ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం

సూళ్లూరుపేట, డిసెంబర్ 17 ప్రభాతవార్త



సూళ్లూరుపేట పట్టణానికి సమీపంలోని మన్నారు పోలూరు క్రాస్‌రోడ్డు వద్ద వత్రపాలెం దగ్గర శనివారం ట్రాక్టర్ బోల్తాపడ్డ ప్రమాదంలో చిట్టమూరు మండలం కుమ్మరిపాలెంకు చెందిన నాగమ్మ దుర్మరణం పాలైంది. సూళ్లూరుపేట నుంచి కూలీ పనుల నిమిత్తం మన్నారుపోలూరు వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దొరవారిసత్రం మండలం శింగనాలత్తూరుకు చెందినబాబు, ఇసుకమిట్టకుచెందిన రాజమ్మ, సూళ్లూరుపేటకు చెందిన రమణమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద



వెంకటగిరి, డిసెంబరు 17, ప్రభాతవార్త:
విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. పెన్షనర్స్‌డే సందర్భంగా చర్చిలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. విశ్రాంత ఉద్యోగులు శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. దొంతు శారదను విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వరరావు, ఉపకరణాధికారి రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తారకరామా స్టేడియంలో క్రికెట్ పోటీలు

వెంకటగిరి, డిసెంబరు 17, ప్రభాతవార్త:
వెంకటగిరి తారకరామా క్రీడా ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి 31 వ తేదీ వరకు సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు ప్రారంభమవుతాయని స్టేడియం మేనేజర్ చెంచు మోహన్ తెలిపారు. నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల మధ్య పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ పొలంరెడ్డి శేఖర్‌రెడ్డి



పెళ్లకూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త
పెళ్లకూరు మండలంలోని గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పొలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లాలు కోరారు. పెళ్లకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్‌బాబు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఇజిఎస్ నిధులు దుర్వినియోగంపై విచారణ

కోట, డిసెంబర్ 17 ప్రభాతవార్త



కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో గతంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు చెల్లింపుల్లో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ గ్రామస్థులు ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పలుసార్లు అధికారులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో శ్రీకాళహస్తి ఎన్ఆర్ఇజిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వామిదాస్ విచారణ చేపట్టారు. వ్యక్తిగత ఫిర్యాదుదారులు కొంతమంది మాత్రమే హాజరయ్యారని, మరోసారి ఫిర్యాదుదారుల నుంచి వివరాలు స్వీకరిస్తామని చెప్పారు.

# అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న జగన్



వాకాడు, డిసెంబర్ 17, ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారని గూడూరు శాసన సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. శనివారం వాకాడు మండలం కల్లూరు, జువ్వినట్లు పంచాయితీ గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించి ఇంటింటికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల కరపత్రం మహిళలకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడప గడప మన కార్యక్రమంను ప్రజలందరూ ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో చెప్పిన విధంగా నూటికి నూరు శాతం అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చెప్పిన విధంగా చేశారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మాండూస్ తుఫాను ప్రభావంతో వరదలు సంభవించి రైతులు నష్టపోయారని, నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. త్వరలో రైతులందరికీ నష్ట పరిహారం అందుతుందన్నారు. అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రానున్న ఎన్నికల్లో 175 సీట్లుకి 175 సీట్లు గెలుపొందడం ఖాయమన్నారు. కల్లూరు, జువ్వినట్లు పంచాయితీ లలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఒక్కడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి, ఎంపిడిఓ గోపినాథ్, కల్లూరు ఎంపిటిసి హేమలత రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ఎస్ఐరఘునాథ్, వాకాటి జనార్ధన్ రెడ్డి, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 25 ఏళ్ల తర్వాత కలిసిన మిత్ర బృందం




కోట, డిసెంబర్ 17 ప్రభాతవార్త
కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముందుగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 1993-97 మధ్య ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అంతా ఒకే వేదికపైకి చేరారు. ఎన్‌బీకేఆర్‌లో క్రమశిక్షణ వల్లే తాము ఉన్నత రంగాల్లో ఉన్నామని కొందరు పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న తరగతి గదులను కలియతిరుగుతూ మరోసారి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కళాశాలలోచదివినందుకు తమవంతు బాధ్యతగా ప్రస్తుత విద్యార్థులకు ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాల్లోసహకరిస్తామనితెలిపారు. అంతేకాకుండాపరిశ్రమలసందర్శనకుప్రాజెక్టువర్కులు చేసుకోవడానికి విద్యార్థులకు అనుమతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఆ రోజుల్లో చదువుకొని నేడు ఉన్నత రంగాల్లో ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పూర్వ విద్యార్థులఆత్మీయసమ్మేళనంజరుపుతుండటంతోపూర్వవిద్యార్థులుకృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాలు



నాయుడుపేట, డిసెంబర్ 17 ప్రభాతవార్త
నాయుడుపేట పట్టణంలో విద్యుత్ శాఖ అధికారులు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని విశ్వభారతి ప్రైవేట్ స్కూల్లో ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీరిలో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులకు విద్యుత్ శాఖ అధికారులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఇ అర్జున, డిప్యూటి ఇఇ శేఖర్, విశ్వభారతి స్కూల్ కరస్పాండెంట్ గోపాల్‌నాయుడు, ప్రిన్సిపాల్ జగదీశ్ తదితరులు ఉన్నారు.

## నాయుడుపేటలో దొంగల హల్‌చల్

నాయుడుపేటరూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త
నాయుడుపేట పట్టణంలోని సికెఎం కాంప్లెక్స్‌లో ఉన్న పలు దుకాణాల్లో దొంగలు హల్‌చల్ చేశారు. కాంప్లెక్స్‌లోని ఆరు దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే ఇద్దరు ఈ దొంగతనాలకు పాల్పడగా, ఒకరు పోలీసులకు దొరికిపోయినట్లు తెలిసింది. పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా విధుల్లో ఉండగా చోరీ సంఘటన వెలుగులోకి వచ్చింది. దొంగల్లో ఒకరు పారిపోగా, మరొకరు పోలీసులకు దొరికినట్లుగా తెలుస్తోంది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సెమిష్టర్ విధానం

కోట,డిసెంబరు 17 ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్ల సెమిష్టర్ విధానం తీసుకొస్తూ ఉత్తర్వులు జారి చేసింది. 2023..24 విద్యా సంవత్సరం నుంచి 1.9వ తరగతి వరకు రెండు సెమిస్టర్ల విధానాన్నితీసుకురానున్నారు. 2024..25నుంచిపదో తరగతిలోనూ సెమిస్టర్ విధానం అమలు చేయనున్నట్లు ప్రభుత్వంవెల్లడిచింది. అందుకు సంబంధించన పాఠ్య పుస్తకాలను కూడా పంపిణీ చేయనున్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి, బట్టలు పంపిణీ

ఐరాల, డిసెంబర్ 17 ప్రభాతవార్త:
మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పాకాల మండలం మొగరాల గ్రామానికి చెందిన కోళ్ళపల్లె సురేష్‌బాబు అనే దాత విద్యాసామాగ్రి, రెడీమేడ్ బట్టలు పంపిణీ చేశారు. తన పుట్టినరోజును ఆయన శనివారం పాఠశాల విద్యార్థుల నడుమ జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు విద్యాసామాగ్రిని, నూతన రెడీమేడ్ బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భానుశేఖర్‌నాయుడు, కోళ్ళపల్లెకు చెందిన వినోద్‌కుమార్, బ్రహ్మతేజ, సీఆర్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

## యుబి పల్లెలో టీడీపీ 'ఇదేం ఖర్మ మన రాష్ట్రషానికి'

తవణంపల్లె, డిసెంబర్ 17 ప్రభాతవార్త:
తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంను మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్ళి ప్రజాభిప్రాయంను సేకరించారు. అలాగే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు, ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్‌నాయుడు, జొన్నగురకల మధుకుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీలు కోదండయ్య, వెంకటేశ్వర చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, సునీల్ చౌదరి, బిసీ సెల్ అధ్యక్షుడు వినాయకం, అరగొండ గిరిబాబు, శరవణ, చిట్టెమ్మ, షబ్బీర్, జయపాల్, ఏకాంబరం, వేణు పాల్గొన్నారు.

# చిట్టేడు సొసైటీకి స్పెషలాఫీసర్‌ను నియమించండి

## రైతుల ఆవేదన

కోట, డిసెంబర్ 17 ప్రభాతవార్త
కోట మండలం చిట్టేడు సొసైటీ ఛైర్మన్ పదవీ కాలాన్ని పొడిగింపుపై సస్పెన్స్ కొనసాగుతోంది. దీంతో సొసైటీ పరిధిలోని రైతులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకొని నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. రైతులకు రుణాలు మంజూరు కావాలంటే సొసైటీ ఛైర్మన్ సంతకం చేయాల్సి ఉంది. ఇక్కడ మూడు నెలల నుంచి ఛైర్మన్ ఎవరో ప్రకటించకపోవడంతో రైతులకు రుణాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వ్యవసాయ సీజన్‌లో రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. చిట్టేడు సొసైటీ ఛైర్మన్ పదవిని అధికార పార్టీలో ఇరువర్గాల వారు తమ వర్గానికే ఆ పదవి ఇవ్వాలని ఉన్నతస్థాయిలో అధికారులపై ఒత్తిళ్లు తేవడంతో ఛైర్మన్ పదవి ఎవరికీ ఇవ్వకుండా ఆపేశారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ జోక్యం చేసుకొని చిట్టేడు సొసైటీ ఛైర్మన్‌ను నియమించాలని లేదా పదవీ కాలాన్ని పొడిగించాలని రైతులు కోరుతున్నారు. పారదర్శకంగా సేవలు అందించాప్రస్తుత చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్ మాట్లాడుతూ తాను సంవత్సర కాలంలో రైతుల నుంచి రావలసిన ఒకటిన్నటి కోటి రూపాయల బకాయిలను వసూలు చేసినట్లు చెప్పారు. రైతు కుటుంబం నుంచి వచ్చానని, తనకు రైతుల కష్టాలు తెలుసని, రైతులకు అందుబాటులో ఉంటూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. తమపై తప్పుడు ఫిర్యాదులు చేసినా అధికారుల విచారణలో ఎక్కడా నిర్ధారణ కాలేదన్నారు. ఇక్కడ స్పెషలాఫీసర్‌ను నియమించి రైతుల కష్టాలను తీర్చాల్సిన అవసరం ఉందన్నారు.

## ఘనంగా రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్ జన్మదిన వేడుకలు

**-10వేలమందికి అన్నదానం.. పట్టణంలో కోలాహలం!!**



కుప్పంరూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త : రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖ మంత్రి డా।। పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, కుప్పం రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ జన్మదిన వేడుకలను కుప్పంలో కౌన్సిలర్లు మణి, ఇళయ రాజా, అభిమానులు, సెంధిల్ ఆర్మీ సభ్యులు ఘనంగా నిర్వహిం చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 500 కిలోల భారీ కేక్‌ను రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ స్థానిక ఎంఆర్‌రెడ్డి సర్కిల్‌లో కట్ చేసి పంచారు. స్థానిక శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయం వద్ద మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు పదివేల మందికి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యువతకు ఆపన్నహస్తం అందిస్తూ అన్ని వేళలా అందుబాటులో ఉంటున్న రెస్కోఛైర్మన్ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భారీ గజమాలతో రెస్కో ఛైర్మన్‌ను సత్కరించారు. రెస్కోఛైర్మన్ జన్మదినం సందర్భంగా పట్టణంలో పెద్ద ఎత్తున కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, రెస్కో ఎండి సుబ్రమణ్యం, ఎడిఇ ప్రభాకర్, జెఎఓ కృష్ణమూర్తి, రెస్కో అధికారులు, కురబ సంఘం నేత శ్రీనివాసులు, శివ, అరుల్, రవి, శ్యామ్ పలువురు వైకాపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపవర్‌తో మెడిక్స్ గ్లోబల్ భాగస్వామ్యం



తిరుపతినగరం, డిసెంబర్ 17 ప్రభాతవార్త: దేశంలో మానసిక ఆరోగ్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, మానసిక ఆరోగ్యం చుట్టూ ఉన్న భయాలను పోగొట్టేందుకు ఎంపవర్ మెడిక్స్ గ్లోబల్ భాగస్వామ్యం చేసుకుందని ఎంపవర్ ఫౌండర్ డాక్టర్ నీరజ బిర్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ ఆరోగ్య నిర్వహణలో సుదీర్ఘమైన అనుభవాన్ని మెడిక్స్ తీసుకువస్తుందన్నారు. భారతదేశంపై అధికంగా దృష్టి సారించి 300 మందికి పైగా డాక్టర్లను నియమించుకుందన్నారు. ప్రతి వైద్య విభాగంలోనూ సుప్రసిద్ధ స్పెషలిస్ట్‌లను కలిగి ఉండటంతో పాటుగా 8 మిలియన్‌ల మంది వినియోగదారులను అంతర్జాతీయమంగా కలిగి ఉందని వివరించారు. వైద్య పరంగా అనారోగ్యంతో ఉన్న వారికలో మానసిక ఆందోళ సమస్యలు అతి సహజంగా కనిపిస్తుంటా యని, ఎందుకంటే మానసిక శారీరక ఆరోగ్యం సైతం మొత్తం ఆరోగ్యంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడిక్స్ సీఇఓ సైగల్ అజ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## యాక్సిస్ బ్యాంక్ శాఖ ప్రారంభం:



శ్రీసిటీ, డిసెంబర్ 17 ప్రభాతవార్త:దేశంలో మూడవ అతి పెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ తమ గ్రామీణ బ్యాంకు శాఖను శ్రీసిటీ చిల్ల మథూర్ వద్ద ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కస్టమ్స్ స్పెసిఫైడ్ ఆఫీసర్ మధుబాబు, శ్రీ సిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నాగరాజన్, శ్రీసిటీ బిజినెస్ రాకేస్ ముఖ్య అతిథిలుగా హాజరైనారు. ఈ సందర్భంగా యాక్సిస్ బ్యాంకు భారత్ బ్యాంకింగ్ హెడ్ మరియు గ్రూప్ ఎగ్జిక్యూటివ్ మునీష్ షార్దా మాట్లాడుతూ గ్రామీణ మరియు పట్టణ మార్కెట్‌లు యాక్సిస్ బ్యాంక్ దృష్టి సారించిన అంతి కీలకమైన సేవలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు నూతి చక్రవర్తి, రీజనల్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్-సౌత్2, ఎం.హరనాథ్, సర్కిల్ హెడ్ ఎం వెంకట్ సుబ్రమణ్యం, కస్టర్‌హెడ్ ఎన్.భ్రమర్‌నాథ్, ఎల్.ఎస్ క్లస్టర్ హెడ్ పాల్గొన్నారు.

## క్యాన్సర్ రోగులకు నూతన చికిత్స విధానం




తిరుపతినగరం, డిసెంబర్ 17 ప్రభాతవార్త: క్యాన్సర్ రోగులకు రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో నూతన చికిత్స విధానం అనే కార్యక్రమంపై ఆంకో ఇంటర్వెన్షన్స్ అండ్ థెరనోస్టిక్స్ ఇన్ హెపాటోబిలియరీ డిసీజెస్ అనే అంశంపై అవగాహన నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. శనివారం శ్రీపద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించన కార్యక్రమానికి స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మెహన్, డాక్టర్ విజయలక్ష్మి, న్యూక్లియర్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ కళావత్, డాక్టర్ ఎ.వై.లక్ష్మి, డాక్టర్ సరళలు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు మంచి వేదికని, తద్వారా వైద్యులకు వైద్య విద్యార్థులకు, పారామెడికల్ విద్యార్థులకు నూతన వైద్య విజ్ఞానాన్ని అందించ్చునని తెలిపారు. ఆంకో ఇంటర్వెన్షన్స్ థెరానోస్టిక్స్ పద్ధతిలో రోగులకు సైడ్ ఎఫెక్ట్ తక్కువగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ డాక్టర్ పవన్‌కుమార్ జి కాలే, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరణ్ బి సింద్, డాక్టర్ వెంకటరామిరెడ్డి, ముక్తేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

**శ్రీబాలాజీ వరప్రసాదిని పథకానికి లక్ష రూపాయల విరాళం:**

స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేయుచున్న శాశ్వత ఉద్యోగి ఎం.హరిప్రసాద్‌రెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినిలో భాగంగా శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ విభాగానికి ఒక లక్ష రూపాయలను స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మకు అందించారు.

**పింక్ బస్ వైద్య శిబిరం :**

స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా మొలకల చెరువు మండలం మార్కెట్ యార్డు నందు మహిళల కోసం 128వ పింక్ బస్ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ప్రారంభించినట్లు డాక్టర్ రామ్ తెలిపారు. ఈ పింక్ బస్ నందు మొబైల్ మెమోగ్రఫీ, గర్భాశయ ముఖద్వారా పరీక్షలు, పాప్‌స్మియర్, నోటి పరీక్షలు, బ్రెస్ అల్ట్రాసౌండ్, అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరికరముల ద్వారా పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అలేఖ్య, అశ్రిత, ఫరీద, ఫరహీన్, శ్రావణి, అప్సన, వినీష, హరిచందన, రాంప్రసాద్, ఎ.డి వి.రాజశేఖర్, జోస్లిన్, పద్మజ్, నాగభూషణమ్మ, కళ్యాణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పదవీ విరమణ తర్వాత కూడా ఒకరికొకరు తోడుగానే



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 17 ప్రభాతవార్త : ఇస్రో ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత కూడా ఒకరికొకరు తోడుగా ఉంటూ ఒక కుటుంబంలాగా ఉంటున్నారని షార్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్. వెంకటరామన్ పేర్కొన్నారు. శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్స్ డే సర్వసభ్య సమావేశం నిర్వహించారు. షార్ ఉద్యోగులు నివాసం ఉంటే పినాకిని నగర్ మల్టీపర్పస్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వెంకటరామన్ పాల్గొన్నారు. తరతమ భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండే సంప్రదాయాన్ని షార్ ఉద్యోగులు కొనసాగిస్తున్నందుకు సంతోషంగా ఉందని ఎడి తెలిపారు. వారికి ఎటువంటి సదుపాయాలు కావాల్సి ఉన్నా అసోసి యేషన్‌గా షార్ యాజమాన్యాన్ని అడిగి సాధించుకోవాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస రావు, డిఆర్‌ఇయు నాయకులు శ్రీనివాసులు, సిఐటియు నాయకులు పద్మనాభయ్య తదితరులు ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్‌ను సత్కరించారు. శ్రీహరికోట ఎస్‌బిఐ మేనేజర్ లాలూనాయక్ మాట్లాడుతూ 75 సంవత్సరాల వయస్సు వరకు తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందిస్తున్నామని, తమ బ్యాంకులో లాకర్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అసోసియేషన్‌కు తనవంతు సహాయంగా 7500 రూపాయల చెక్కు అందజేశారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు హుస్సేన్, కుమారస్వామి, రమణరావు, వివేకం తదితరులు పాల్గొన్నారు.

## సాధుసుబ్రమణ్యశాస్త్రి వందకోట్ల హిందువుల ఆస్తి: ఎమ్మెల్యే

తిరుపతి, డిసెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ చరిత్రను ప్రపంచానికి తెలియజేసిన శ్రీమాన్ సాధుసుబ్రమణ్యశాస్త్రిదేశంలోని కోట్లమంది హిందువుల ఆస్తి అని ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సాధుసుబ్రమణ్యశాస్త్రి 133వ జయంతిని శనివారం తిరుపతిలోని శ్వేత సమావేశం మందిరంలో జరిగింది. ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీవారి ఆలయ చరిత్ర వెలికితీసిన శాస్త్రి స్వామివారికి అనన్యసేవ చేశారన్నారు. రాణి సామవై భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని ఆలయానికి అందించారని శాస్త్రి వెలికి తీసిన శాసనమే శ్రీవారి ఆలయ చరిత్ర బయటకు రావడానికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, సాధుసుబ్రమణ్యశాస్త్రికుమార్తె గిరిజ, మనమడు, కడపజిల్లా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సిఎస్ మూర్తి, శాసన పరిశోధకుడు కృష్ణారెడ్డి, టిటిడి సిఎఓ శేషశైలేంద్ర, డిఇఓ భాస్కర్‌రెడ్డి, ఎస్వీమ్యూజియం ప్రత్యేక అధికారి కృష్ణారెడ్డి, ఓరియంటల్ కళాశాల ఆచార్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిటిడి ముద్రించిన సారస్వత సంవీక్షణం పుస్తకాన్ని ఆవిష్కరించారు

## ఇదేంఖర్మ మనరాష్ట్రానికి జనం స్పందన

తిరుపతి, డిసెంబర్ 17ప్రభాతవార్త: రాష్ట్రంలో వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారివారిస్థలాల్లో ప్రశాంతంగా ఉన్నామనే ఆశలు లేవని టిడిపి నాయకులు తెలిపారు. రాష్ట్రంలో వైకాపా నాయకుల కక్షసాధింపు ధోరణులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతకాని పాలనతో ప్రజలు అనేక బాధలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇదేంఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో శనివారం 25వ డివిజన్ పల్లెవీధి, వేశాలమ్మవీధి పరిసరాల్లో జరిగింది. 25వ డివిజన్ ఇన్‌ఛార్జి ,యువనేత జ్ఞానశేఖర్ ,యూనిట్ ఇన్‌ఛార్జి జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సుగుణమ్మ, బుల్లెట్‌రమణ, ఇనుకొండ సుబ్రమణ్యం, విజయలక్ష్మి, వట్టికుంట చినబాబు, మహేష్ యాదవ్ ,కుప్పయ్య, శ్రీనివాస్, రేవంత్‌కుమార్ టిడిపి నాయకులు ఇంటింటికెళ్లి వైసిపి పాలనపై ప్రజలకు కలుగుతున్న కష్టాలపై కరపత్రాలను అందించారు.

# రైలు ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

వడమాలపేట, డిసెంబరు 17 ప్రభాతవార్త: మండలంలోని వేమాపురం వద్ద రైలు ఢీకొనడంతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి 8 గంటలకు చోటు చేసుకుంది. తిరుమండ్యం దళితవాడకు చెందిన బాలకృష్ణ(44) ఉపాధ్యాయుడిగా పుత్తూరు రూరల్ మండలం తడుకు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం వడమాలపేటకు వచ్చిన ఆయన తిరిగి వెళుతూ వేమాపురం అండర్ బ్రిడ్జి కింద నీళ్ల ఉండడంతో రైలు కట్టపై పట్టాలుదాటుకుంటున్న సమయంలో రైలు ఢీకొంది. తల నుజ్జు నుజ్జు కాగా బాలకృష్ణ అక్కడి కక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం రైలు కట్ట దాటుతున్న వారు మృతదేహాన్ని గుర్తించి తనిఖీ చేశారు. గుర్తింపు కార్డు ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉదయం 10 గంటలకు కూడా రైల్వే అధికారులు కాని, పోలీసులు కాని రాలేదు.



**అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం :**

వేమాపురం అండర్ బ్రిడ్జిలో నీళ్ల నిలిచిపోయి వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వేమా పురం, తిరుమండ్యం గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, విద్యార్థులు రైలు కట్టపైకి ఎక్కి రావడానికి నానా అవస్థలు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడమాలపేటకు 3 కి.మీ దూరం ఉన్న వేమాపురం గ్రామస్థులు 10 కి.మీ తిరిగి రావాల్సి ఉంది. దీంతో పలువురు వాహనదారులు తమ వాహనాలను బ్రిడ్జి వద్ద పెట్టి కట్టపై నుంచి నడుచుకుంటూ ఇళ్ళకు వెళుతున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు.

## వెంకటరెడ్డిపల్లి కాజ్‌వే వద్ద ట్రాఫిక్ సమస్య



బాలాయపల్లి, డిసెంబరు 17, ప్రభాతవార్త: మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కాజ్‌వే నిర్మాణ పనులు జరుగుతుండడంతో నిత్యం వాహనాల వారు ఇబ్బంది పడుతున్నారు. నేరేడు కాలువపై ఉన్న కాజ్‌వే తుఫానుకు కొట్టుకు పోవడం వలన మరమ్మతు పనులు సాగిస్తున్నారు. కాజ్‌వే వద్ద వాహనాలు గంటల తరబడి ఆగిపోతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ప్రయాణికుల అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. త్వరితగతిన కాజ్‌వే పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## యుద్ధంలో పాల్గొన్న మాజీ కుప్పం సైనికుడికి సత్కారం



కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త : 1971వ సంవత్సరంలో శత్రుదేశం పాకిస్తాన్‌పై విజయంలో కీలకపాత్ర పోషించిన నాటి సైనికులను కర్ణాటక రాజధాని బెంగళూరులో ఘనంగా సత్కరించారు. కర్ణాటక కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో ఈ కార్యక్రమను ఘనంగా నిర్వహించారు. 1971 నాటి పాకిస్తాన్ యుద్ధంలో భారతదేశం తరపున కుప్పంకు చెందిన బైరేపల్లి బాలకృష్ణప్పను ఈ సందర్భంగా దుశ్శాలువ, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. బాలకృష్ణప్ప 1969-1988మధ్య సుమారు 19 ఏళ్ల పాటు భారతదేశ సైన్యంలో పనిచేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం సందర్భంగా బాలకృష్ణప్ప మోచేతికి పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో తూటా దిగింది. అయితే ఆయన ధైర్యం కోల్పోక శ త్రుసైన్యంతో ధైర్యంగా పోరాడారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు నాటి పాకిస్తాన్ యుద్ధం విషయాలను గుర్తు తెచ్చుకున్నారు.

## కాణిపాకంలో ఈఓ విస్తృత తనిఖీలు



కాణిపాకం, డిసెంబర్ 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వవినాయకస్వామివారి దేవస్థానంలో ఆలయ ఈఓ ఎ.వెంకటేశు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. దేవస్థానం పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈమేరకు వాహన పార్కింగ్ ప్రదేశాలు, ఆలయ పరిసరాల్లో పారిశుద్య పనులు, గణేష్ సదన్, వినాయకసదన్ వసతి సముదాయంలోని కౌంటర్లును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుద్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని సూచించారు. ఈఓ వెంట ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ హరిమాధవరెడ్డి, సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



పెద్దపంజాణి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : మండలంలోని అప్పిన పల్లి జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న అజయ్, వ ంశీ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌వాల్ అండర్ -14,17పోటీలకు ఎంపికయ్యారు. వీరు సోరకాయల పాళెం హైస్కూల్‌లో జరిగిన సెలక్షన్స్‌లో ఎంపికయ్యారు. త్వరలో పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్ఎం వాసుదేవ ప్రసాద్, పిఇటి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆర్‌జేడి ఆకస్మిక తనిఖీ



పలమనేరు, డిసెంబరు 17 ప్రభాతవార్త: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డా.పి.బాబు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు కళాశాల పనితీరును, అధ్యాపకుల హాజరును ఆయన పరిశీలించారు. కళాశాలలోని సమస్యలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

గుడిపాల, డిసెంబర్ 17 ప్రభాతవార్త: మండలంలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో మౌనిష్(21) శనివారం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామంకు చెందిన గోవిందరాజులు కుమారుడు మౌనిష్ శనివారం తెల్లవారుజాము ఇంటి సమీకంలోకి వెళ్ళి ఎంత సమయమైనా రాకపోయేసరికి తల్లిదండ్రులు వెళ్ళి చూడగా కరెంట్ షాక్‌కు గురై మృతి చెంది వుండటం చూశారు. ఎవరో అటవీ జంతువుల కోసం ఏర్పాటు చేసిన కరెంట్ తీగలు తగలి మౌనిష్ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది సంఘటనా స్థలం చేరుకొని మృతదేహంను పరిశీలించి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేస్తామని ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగారు.

## వైకాపా పాలనలో రాష్ట్రం రావణకాష్టం : శాంతారాం



కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త : వైకాపా పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారి శాంతిభద్రతలు క్షీణించాయని తెదేపా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వైద్యం శాంతారాం ఆరోపించారు. పల్నాడు జిల్లా మాచర్లలో తెదేపా నేతలపై వైకాపా గూండాలు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. తెదేపాకు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేకనే వైకాపా శ్రేణులు దాడులకు తెగబడుతున్నారన్నారు. తమ పార్టీ నేతలపై, ఇళ్లు, వాహనాలపై దాడులు ఆటవిక చర్యలన్నారు. వెంటనే ఈ దారుణాలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైకాపా దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని మృతి

శాంతిపురం, డిసెంబర్ 17 ప్రభాతవార్త : మండలంలోని ఏడవమైలుకు చెందిన విద్యార్థిని లావణ్యను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరిన విషయం విదితమే. అయితే పిఇఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లావణ్య మృతి చెందింది. దీంతో శనివారం మోడల్ స్కూల్‌కు సెలవు ప్రకటించారు. తమతో పాటు చదువుకుంటున్న లావణ్య అకాల మరణంను విద్యార్థినులు జీర్ణించుకోలేక భోరున విలపించారు. విద్యార్థిని మృతి పట్ల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## 19న పుదిపట్లలో అండర్-17 జిల్లా కబడ్డీజట్టు ఎంపిక

చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆఫ్ ఎపిలో భాగంగా ఈనెల 19న అండర్-17బాల, బాలికల కబడ్డీ జిల్లా జట్టును ఎంపికను మండలంలోని పుదిపట్ల ఉన్నతపాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ఎంపికయి, 2006జనవరి 1తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. నిబంధనలకు లోబడి వున్న అన్ని రకాల ధరఖాస్తు ఫారాలతో హాజరు కావాలన్నారు. నియోజకవర్గ కన్వీనర్ రామచంద్ర, జిల్లా పిడి, పిఇటిల సంఘ అధ్యక్షుడు వెంకటేష్, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు సురేష్, బాబు, రాము తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

పుత్తూరురూరల్, డిసెంబరు 17 ప్రభాతవార్త: పుత్తూరు మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.భారతి తెలిపారు. 15వ తేదీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొరకాయపాళెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరచి అండర్-17 బాలికల విభాగంలో 10వ తరగతి చదువుతున్న శిరీష, అండర్-14 బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న చైతన్య, బాలుర విభాగంలో 9వ తరగతి చదువుతున్న కిరణ్‌కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21,22,23 శ్రీకాకుళంలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ గోపికృష్ణ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ విరిత, వైసీపీ నాయకుడు దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



రొంపిచెర్ల, డిసెంబరు17ప్రభాతవార్త : మండల పరిదిలో ఇటీవల వచ్చిన మాండూస్ తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. శనివారంఆయన మండల పరిదిలోని గానుగచింత, మోటుమల్లెల పంచాయతీలలోని పంటలను పరిశీలించారు. అంతకు ముందు రొంపిచెర్ల-2లోని రైతు భరోసా కేంద్రాన్నితనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా సమీకృత వ్యవసాయ సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నెంబరు వాట్సాప్ నెంబరులను ఆర్‌బీకేలలో ప్రదర్శించారా లేదా అని తనిఖీ చేశారు. కియోస్క్ ను పరిశీలించి ఎరువుల స్టాక్ లెడ్జర్‌ను తనిఖీ చేశారు. ఈపంట నమోదు రబీ 2022-23కు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి, ఏఈఓ ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు

## శివయ్య సన్నిధిలో శ్రీరామపాదుకలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం శ్రీరామ పాదుకలు వచ్చాయి. వాటికి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పూజలు జరిపి, శివయ్య సన్నిధిలో పూజలు జరిపించారు. శ్రీరామ పాదుకలు రాగా ఆలయ దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. శ్రీరామపాదుకలను తలపై ఎత్తు కొని పరిపాలనా భవనం నుంచి స్వామి వారి గర్భగుడి వరకుమోసుకుంటూ వెళ్ళారు. పాదుకలను తీసుకొచ్చిన వారికి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. శేష వస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను ఎసి మల్లికార్జున్ ప్రసాద్ పర్యవేక్షించారు.

## అయ్యప్పస్వామికి ప్రత్యేకపూజలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రసిద్ధిచెందిన శ్రీకాళహస్తి ఆలయంలో హరిహర సుతుడు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజ లును ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి విశేషపూజలు ప్రతిరోజు జరగనున్నాయి. శతాబ్దాల క్రితమే శ్రీకాళహస్తి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ధనుర్మాసంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించడం ఆధ్యాత్మిక భావనకు నిదర్శనం అన్నారు. అనంతరం స్వామివారిని మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్ళి 16కాళ్ల మండపంలో కొలువుతీర్చారు. ప్రతిరోజు అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి విశేష అభిషూకాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు రమాప్రభ, ప్రత్యేక ఆహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, మరియు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## డ్వాక్రా ఉత్పత్తులను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమన



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త : తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో డ్వాక్రా చేతి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి శనివారం ప్రారంభించారు. చేతి వృత్తిదారులు, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నట్లు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కోటా దేవకీదేవి తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అభ్యదయ గ్రామీణ డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నుండి సంక్రాంతి పండుగ వరకు నిర్వహణ వుంటుందన్నారు. ఈ డ్వాక్రా బజార్లో మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తిదారులు వస్తువులు, ఉప్పాడపట్టు, వెంకటగిరి, కంచి, బెనరస్ చీరలు, భాగల్ పూర్ శారీస్, నారాయణపేట, పోసంపట, చీరాలు వస్త్రాలతో పాటు కలంకారి, ఫ్యాన్సీ వస్తువుల ప్రదర్శన, అమ్మకాల స్టాల్స్, పిల్లలకు అవసరమైన ఆట బొమ్మలు, ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయడం జరిగిందని, అతి తక్కువ ధరలకు సామాన్య ప్రజలకు అన్ని రకాలు వస్తువులు అందుబాటులో ఉంటాయని, తిరుపతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవకిదేవి కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు యాదవ్, కోఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

## అమరావతి రైతులకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుంది!

**-జనసేన జిల్లా ఇన్‌ఛార్జ్ డా।।పసుపులేటి హరిప్రసాద్**



తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం తమ ప్రాణాలకంటే ఎక్కువగా ప్రేమించే పొలాలు 33 వేల ఎకరాలను త్యాగం చేసి ప్రస్తుత ప్రభుత్వం చేతిలో మోసపోయి, న్యాయ పోరాటం చేస్తున్న అమరావతి రైతులకు తమ సంపూర్ణ మద్దతు ఎప్పుడూ ఉంటుందని జనసేన పిఎసి సభ్యుడు, తిరుపతి-చిత్తూరు ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ డా।।పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యలో జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి వెళ్లి డా।।హరిప్రసాద్ రైతులకు తమ పార్టీ తరపున సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, పిఏసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ల ఆదేశాల మేరకు తాను నేతలతో కలిసి రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొనడం జరిగిందన్నారు. గతంలో అమరావతి రైతులు తలపెట్టిన న్యాయస్థానం టు దేవస్థానం మహా పాదయాత్రలో తమ అధినేత పాల్గొన్నారని, ఇప్పుడు తాము ఈ ధర్నాలో పాల్గొన్నామన్నారు. ఒకే రాష్ట్రం-ఒకటే రాజధాని అమరావతి అనే మాటకు జనసేన కట్టుబడి ఉందన్నారు. ఏ రాష్ట్రంలోనైనా రైతులను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు కుప్ప కూలిన సంఘటనలు అనేకమని చరిత్ర చెబుతోందని, ఆ విషయం ఈ వైసిపి ప్రభుత్వం గుర్తెరిగి రాష్ట్ర హైకోర్టు తీర్పు ప్రకారం అమరావతినే రాజధానిగా కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.

## జంతర్‌మంతర్ వద్ద అమరావతిరైతుల పోరాటం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి కోసం దేశరాజధాని న్యూడిల్లీ జంతర్ మంతర్ వద్ద అమరావతి రైతుల ధర్మపోరాటంలో ఎంపిలు రఘురామరాజు, గల్లా జయదేవ్, రామమోహన్‌నాయుడు, మాజీ ఎంఎల్‌ఏ తెనాలిశ్రావన్‌కుమార్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగించారని శ్రీకాళహస్తి నుంచి అమరావతి రైతుల దీక్షకు వెళ్ళిన వారితో పట్టణానికి చెందిన తెలుగు దేశం పార్టీమెంటు మహిళా అధ్యక్షుడురాలు చక్రాల.ఉష తరలివెళ్ళి వారికి సంఘీభావం తెలిపారు. పలువురు ఎంపిలు మాట్లాడుతూ మూడుముక్కల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ ఓట్లు లబ్ధిపొందాలనే దుర్భిద్ధితో జగన్‌పాలన చేస్తున్నాడని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశరాజధాని అయిన డిల్లీలో ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలని రాజధాని పరిరక్షణ సమితి నాయకులు, మహిళలు, రైతులు మరియు రైతు కూలీలు, రాజధాని డిల్లీలో అమరావతి నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.

## నేడే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌పోటీలు



రేణిగుంట, డిసెంబరు 17 ప్రభాతవార్త: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ చిత్తూరు ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో రేపటి నుంచి అండర్ 14,17 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు రేణిగుంట బాలికల, ఉన్నత పాఠశాల(జూనియర్ కళాశాల)లో జరుగుతుందని ఉమ్మడిజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శులు బాబు, సురేష్, రామ పాఠశాల ప్రధాన ఆచార్యులు విష్ణువర్ధని సంయుక్తంగా తెలిపారు. శనివారం విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు, మేనేజర్లు, పాల్గొంటారని తెలిపారు. వీరికి వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.ఏ.సురేష్, తిరుపతి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు లిమిటెడ్**
నంబర్.6234, శ్రీకాళహస్తి

**సిఈఓ నియామకానికి ప్రకటన**

శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు నందు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా పనిచేయుటకు ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంకుల నుంచి మేనేజర్ స్థాయిలో లేదా అసిస్టెంట్ మేనేజర్ స్థాయిలో పనిచేసి పదవీవిరమణ చేసిన ఆఫీసర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. ఆసక్తిగలవారు క్రింద కనపరచిన చిరునామాకు తమ దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపవలసినదిగా కోరుచున్నాము.

శెట్టిపల్లి సురేష్‌బాబు, ఛైర్మన్
సెల్ నంబర్.9393222280

ది మేనేజర్, శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు.లి.5/904, ఎం.జి.స్ట్రీట్, శ్రీకాళహస్తి-517644.